క్లుప్తంగా

పీ4 సర్వే పరిశీలన



ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం నిర్వహిస్తున్న పీ4 సర్వేను విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య స్థానిక జాకీర్ హుస్సేన్ కళాశాల రోడ్డులో మంగళవారం పరిశీలించారు. గుర్తించిన పేదల వివరాలు యాప్‌లో పొందు పర్చుతున్న అంశాలపై ఆయన ఆరా తీశారు. ప్రజలను అడుగుతున్న ప్రశ్నలు, వారు చెబుతున్న సమాధానాలను గమనించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సిబ్బంది అడిగే ప్రశ్నలకు నిర్భయంగా సమాధానాలు చెప్పాలన్నారు. సర్వే పూర్తయిన అనంతరం గుర్తించిన పేదల లిస్టులు గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారన్నారు. తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓ-1 సుభాషిణి బాధ్యతల స్వీకారం



ముసునూరు: మండల విద్యాశాఖాధికారి-1గా పి.సుభాషిణి బాధ్యతలు చేపట్టారు. గోపన్నపాలెం జెడ్పీ హైస్కూల్లో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆమె ముసునూరు మండల ఎంఈఓ-1గా మంగళవారం పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆమెను ఉపాధ్యాయ సంఘాల నేతలు పద్మకిశోర్, రాంబాబు, సాయిబాబు, ఉదయభాస్కర్, బాబూరావు, రాజు, బెనర్జీ తదితరులు అభినందించారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో విద్యార్థిని ఎంపిక



మైలవరం: ఆన్‌లైన్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థిని ఎం. లక్ష్మీ పల్లవి (ఏఐ అండ్ డీఎస్) ఎంపికైందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మంగళవారం తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ డెల్టా ఎక్స్ టీమ్ ఆన్‌లైన్‌లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించిందన్నారు. విద్యార్థిని లక్ష్మీపల్లవిని కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, డీన్ డాక్టర్ వి. సూర్యనారాయణ, ఏఐ అండ్ డీఎస్ విభాగాధిపతి డాక్టర్ పి. భగత్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

వేతనాల కోసం కార్మికుల అర్ధ నగ్న ప్రదర్శన



ఇబ్రహీంపట్నం: మూడు నెలల వేతనాలతో పాటు 2022 జూలై నుంచి పెంచిన వేతనాలు సైతం చెల్లించాలని మైలవరం పైలెట్ ప్రాజెక్ట్ ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికులు ఇబ్రహీంపట్నంలో మంగళవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. సీపీడబ్ల్యూఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ యూనియన్ల రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్టర్ నెలల తరబడి కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం అత్యంత దారుణమన్నారు. ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం వలన కార్మికుల కోసం డ్రా చేసిన డబ్బులు కార్మికులకు ఇవ్వడం లేదని విమర్శించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తక్షణం స్పందించి కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

జి.కొండూరు: సంతానలేమి, అప్పుల బాధతో మనస్తాపానికి గురైన వ్యక్తి గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జి.కొండూరు మండల పరిధి కవులూరు గ్రామానికి చెందిన ప్రత్తిపాటి కరుణసాగర్ (43) వ్యవసాయ కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య రేణుకతో పదిహేనేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇప్పటివరకు పిల్లలు పుట్టలేదు. కొద్దిపాటి అప్పులు కూడా ఉండడంతో మానసికంగా కుంగిపోయిన కరుణసాగర్ మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి స్పృహ తప్పి పడిపోయాడు. కొద్ది సమయం గడిచాక గమనించిన కుటుంబ సభ్యులు కరుణసాగర్‌ని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌చార్జి ఏఈలతో ఎంతకాలం?

- అధికారులు లేని ఇరిగేషన్ శాఖ
- సాగునీటి వనరుల పర్యవేక్షణ శూన్యం
- ఇన్‌చార్జి ఏఈలతో కాలక్షేపం
- అంచనాలు వేసే అధికారులు లేక ఆగిన పనులు



తిరువూరులోని మైనర్ ఇరిగేషన్ స్పెషల్ సెక్షన్ కార్యాలయం



మూతబడిన తిరువూరు హైడ్రాలజీ ప్రాజెక్టు సెక్షన్ కార్యాలయం

తిరువూరు: మెట్ట ప్రాంతమైన తిరువూరు నియోజకవర్గంలో సాగునీటి వనరుల పర్యవేక్షణకు మైనర్ ఇరిగేషన్ శాఖలో అధికారులు కరువయ్యారు. ఇక్కడ పనిచేసే ఏఈలను ఇతర ప్రాంతాలకు బదిలీ చేసిన ఉన్నతాధికారులు వారి స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో సాగునీటి సంఘాలు చేసే కాలువల మరమ్మతు పనులపై పర్యవేక్షణ కరువైంది. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల్లో ఒక్క అసిస్టెంట్ ఇంజినీర్ కూడా లేకపోవడంతో కంచికచర్ల స్పెషల్ సబ్ డివిజన్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇరిగేషన్ శాఖ కార్యాలయాలు సైతం శిథిలావస్థకు చేరి కూలే స్థితిలో ఉన్నాయి.

పని ఒత్తిడితో బదిలీ..

తిరువూరులో పనిచేసిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిశోర్ రెండు నెలల కిందట సాధారణ బదిలీలో గొరవరం ఎన్ఎస్‌పీ సెక్షన్‌కు బదిలీ కాగా, ఇక్కడ పర్యవేక్షణాధికారులెవరూ లేకపోవడంతో రిలీవ్ చేయలేదు. నాలుగు మండలాల్లో పనులను పర్యవేక్షించడం తలకు మించిన భారమవడంతో ఆయన మైనర్ ఇరిగేషన్ నుంచి ఎన్ఎస్‌పీ కెనాల్స్‌కు బదిలీ చేయించుకుని వెళ్లారు. తిరువూరు నియోజకవర్గంలో మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలో 70 చెరువులు, ఆరు సప్లయ్ ఛానల్స్ ఉన్నాయి. సుమారు లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీరందించే ఈ నీటి వనరులకు మరమ్మతులు, పూడిక తీత పనులు చేపట్టాల్సి ఉండగా పని విలువ అంచనాలు వేసి ఆమోదం కోసం పంపే ఇంజినీరింగ్ అధికారులు లేకపోవడంతో ఇబ్బందులెదురవుతున్నాయి. తిరువూరులో పడమటివాగు సప్లయ్ చానల్, కట్టెలేరు సప్లయ్ చానల్, కోడూరు విప్పలవాగు సప్లయ్ చానల్స్ పరిధిలోనే అధికశాతం గ్రామాలుండగా, సాగునీటి సంఘాలకు నిధులున్నా పనులు చేయలేని పరిస్థితి నెలకొంది.

మూతబడిన హైడ్రాలజీ విభాగం..

తిరువూరు మైనర్ ఇరిగేషన్ స్పెషల్ సెక్షన్‌కు అనుబంధంగా ఏర్పాటు చేసిన హైడ్రాలజీ విభాగానికి అసిస్టెంట్ ఇంజినీర్ లేక తాళాలు వేశారు. ఆరు నెలల కిందట ఒక ఏఈని ఇక్కడ నియమించినప్పటికీ విధులకు హాజరు కాకపోవడంతో వర్షపాతం నమోదు తదితర విధులు నిర్వర్తించేవారు కరువయ్యారు. రెయిన్ గేజ్ కూడా శిథిలమై నిరుపయోగంగా మారింది.



పోస్టులు భర్తీ చేయాలి

వ్యవసాయ రంగానికి అవసరమైన సాగునీటి వనరుల పర్యవేక్షణలో కీలకమైన మైనర్ ఇరిగేషన్ శాఖకు అధికారులను నియమించకుండా కాలయాపన చేయడం తగదు. నియోజకవర్గ కేంద్రమైన తిరువూరులో సైతం మైనర్ ఇరిగేషన్ స్పెషల్ సెక్షన్ కార్యాలయంలో ఏఈ లేక పనులు జరగని పరిస్థితి నెలకొనడం దారుణం. వెంటనే అన్ని సెక్షన్లకు ఏఈలను నియమించాలి.

– తాళ్లూరి నవీన్‌కుమార్, వైఎస్సార్ సీపీ తిరువూరు మండల అధ్యక్షుడు



ఇన్‌చార్జీలతో పనులు జరగడం లేదు

గ్రామ స్థాయిలో చెరువులకు మరమ్మతులు, పూడిక తీత వంటి పనుల నిర్వహణకు సాగునీటి సంఘాలకు నిధులు కేటాయించే అవకాశం ఉన్నా అధికారులు అంచనాలు వేసే పరిస్థితి లేకపోవడం తగదు. ఇన్‌చార్జి అధికారులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో తెలియక పోవడంతో అత్యవసర పనులు సైతం నిర్వహించలేకపోతున్నారు. వెంటనే ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి.

– మామిడి కుటుంబరావు, సర్పంచి, ఆంజనేయపురం

అంగన్‌వాడీ కార్యకర్తపై టీడీపీ నాయకుడి వేధింపులు

జి.కొండూరు: మండల పరిధి గంగినేని గ్రామంలోని ఎస్సీ ఏరియాలో అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న కార్యకర్తపై గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడి వేధింపులు తారస్థాయికి చేరాయి. వివరాలలోకి వెళ్తే.. గంగినేని ఎస్సీ ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఆనుకొని నేరేడు చెట్టు ఉంది. ఆ చెట్టు మీద ఉన్న పురుగులు నిత్యం అంగన్‌వాడీ కేంద్రంలోకి రావడంతో పాటు పిల్లలు తినే ఆహారంలో సైతం పడుతున్నాయంటూ కొమ్మలు నరికించేందుకు ఇటీవల సర్పంచ్ పిల్లి రామారావుని అంగన్‌వాడీ కార్యకర్త సంప్రదించారు. సర్పంచ్ ఈ విషయాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లి కొమ్మలను నరికించారు. దీనిపై గ్రామ టీడీపీ నాయకుడు తనకు చెప్పకుండా చేశారనే అక్కసుతో అంగన్‌వాడీ కార్యకర్త చెట్టును నరికించి అమ్ముకునేందుకు ప్రయత్నం చేస్తుంటే తాను అడ్డుకున్నట్లు తన అనుకూల పత్రికల్లో వార్తలు రాయించాడు. దీనితో అంగన్‌వాడీ కార్యకర్త ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అధికారుల అనుమతితోనే కొమ్మలు నరికించినప్పటికీ తప్పుడు ఆరోపణలతో కార్యకర్తను ఇబ్బంది పెట్టేందుకే దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ఆగిరిపల్లి: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోళ్ల అనూష అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామని ఎంపీడీఓ బి.భార్గవి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

కూటమి మోసాలు ప్రజలకు వివరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్ అప్పారావు

మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

చాట్రాయి: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, చంద్రబాబు మోసాలను నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని సి.గుడిపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో తల్లికి వందనం మొదటి సంవత్సరం ఎగనామం పెట్టారని, అన్నదాత సుఖీభవ చాలా మంది రైతులకు పడలేదని, 50 సంవత్సరాల బీసీ మహిళలకు పింఛన్ ఇవ్వలేదని, ఇంట్లో ఎంతమంది మహిళలు ఉంటే అంత మందికి నెలకు రూ.1,500 ఇవ్వలేదని, నిరుద్యోగులకు నెల నెలా నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదని, వలంటీర్లకు నెలకు రూ.10 వేలు ఇస్తానని పూర్తిగా వలంటీర్లను తొలగించారని, ఉచిత గ్యాస్ తుస్సుమందని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయలేక వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు పెట్టి అరెస్టులు, ఆస్తుల ధ్వంసాలు, హత్యలతో రాక్షస పాలన సాగిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పరామర్శ యాత్రలకు వస్తున్న జనాలను చూసి చంద్రబాబుకు నిద్ర పట్టక రోడ్లు తవ్వడం, అరెస్టులు చేయడం లాంటివి చేస్తున్నప్పటికీ లక్షల్లో జనం వస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దేశిరెడ్డి రాఘవరెడ్డి, నియోజకవర్గ పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు చెలికాని బాబ్జి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పరసా చెన్నారావు, మండల పార్టీ అధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, సర్పంచ్ విస్సంపల్లి ప్రశాంతి, నాయకులు మోరంపూడి నాగేశ్వరరావు, కారంగుల వాసు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలి

డీపీఓ లావణ్యకుమారి



అవగాహన కల్పిస్తున్న డీపీఓ లావణ్యకుమారి

జూపూడి(ఇబ్రహీంపట్నం): పారిశుద్ధ్య పనుల్లో భాగంగా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలని జిల్లా పంచాయతీ అధికారి లావణ్యకుమారి పేర్కొన్నారు. తడి, పొడి చెత్త సేకరణ, కంపోస్ట్ తయారీ అంశాలపై పలు శాఖల అధికారులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం జూపూడి గ్రామంలో నిర్వహించారు. వీధుల్లో సేకరించాల్సిన చెత్త నుంచి వర్మి కంపోస్ట్ ఎలా చేయాలనే విషయంపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను ఎలా సేకరిస్తున్నారు, హోటళ్లు, వ్యాపార సంస్థల నుంచి సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించడం వంటి అంశాలను వివరించారు. పాడైన కూరగాయలు, పేడ, ఎండు ఆకులు పొరలుగా అమర్చి విండ్రో కంపోస్ట్ తయారు చేయాలన్నారు. డీఎల్‌పీఓ రాఘవన్, ఎంపీడీఓ సునీత శర్మ, వివిధ మండలాల ఎంపీడీఓలు, డెప్యూటీ ఎంపీడీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు

మండల వ్యవసాయాధికారి చాముండేశ్వరి



గోపవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

ముసునూరు: వరిలో తెగుళ్ల నివారణతో దిగుబడులు పెరిగి రైతులు లాభం పొందవచ్చని మండల వ్యవసాయ శాఖాధికారి ఆలూరి చాముండేశ్వరి అన్నారు. గోపవరంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరిలో తెగుళ్ల నివారణకు బీజామృతం తయారీని, వాడే విధానాన్ని రైతులకు వివరించారు. వరి నారు కట్టల చివర్లు కత్తిరించి ద్రావణంలో ముంచి నాటడం ద్వారా కాండం తొలుచు పురుగును, అగ్గి తెగులును నివారించవచ్చని వివరించారు. అనంతరం వరి నాట్లు వేస్తున్న పొలాలను పరిశీలించారు. కార్యక్రమాల్లో వీహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

డ్రోన్లతో ప్రయోజనాలు..

చాట్రాయి: కాలానుగుణంగా యంత్రాలతో వ్యవసాయం చేయాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ అన్నారు. మంగళవారం చిత్తపూరు గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డ్రోన్ ద్వారా చాలా రకాల వ్యవసాయ పనులు చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ముచ్చనపల్లిలో రీసర్వే పూర్తి

మైలవరం: రెడ్డిగూడెం మండలం ముచ్చనపల్లి గ్రామంలో రీసర్వే పూర్తయిందని, దీనికి సహకరించిన రైతులను అభినందిస్తున్నామని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం. సతీష్‌కుమార్ అన్నారు. ముచ్చనపల్లి గ్రామ సచివాలయం వద్ద ఇన్‌చార్జి తహసీల్దార్ సతీష్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. రీ సర్వే వివరాలు చదివి వినిపించి నోటీసు బోర్డులో ప్రదర్శించారు. సర్పంచ్ దేవళ్ల జమలయ్య, అట్లూరి శ్రీనివాసరావు, నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్లతో నిఘా

ఆగిరిపల్లి: బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్లతో నిఘా ఉంచామని, చట్టాలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శుభశేఖర్ హెచ్చరించారు. మంగళవారం ఈదర శివారు ప్రాంతంలో డ్రోన్ కెమెరాలతో ఎస్ఐ శుభశేఖర్, సిబ్బంది పర్యవేక్షించారు. ఈదర శివారు ప్రాంతాల్లో సారా తయారీ, బహిరంగంగా మద్యం సేవించడం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడానికి ఈ చర్యలు తీసుకున్నామని చెప్పారు.

స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



ఇబ్రహీంపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం: విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ ఇబ్రహీంపట్నం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీఐటీయూ నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని నినాదాలు చేశారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు పగులగొట్టాలని నారా లోకేష్ పిలుపునిచ్చిన విషయం గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యతిరేక ధోరణితో వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. తక్షణమే అదాని స్మార్ట్ మీటర్లు ఆపాలని, లేకుంటే ప్రజాందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ. కమల, మండల కార్యదర్శి మహేష్, నాయకులు విఠల్‌రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి బాషా, సీఐటీయూ మండల ఉపాధ్యక్షురాలు కె. రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తిరువూరులో ధర్నా

తిరువూరు: విద్యుత్ సర్వీసులకు స్మార్టు మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ తిరువూరు ఎస్ఆర్ టవర్స్ సెంటర్‌లో కాంగ్రెస్, వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్ట్ మీటర్లను పగులగొట్టమని చెప్పిన మంత్రి లోకేష్ ఇప్పుడు అదే మీటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పల్లెపాటి శ్రీనివాసరావు విమర్శించారు. కేటగిరీ-2 సర్వీసులకు ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లను కూడా తొలగించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం. నాగేంద్రప్రసాద్ కోరారు. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

- మైలవరం: పుల్లూరు సబ్ స్టేషన్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు, రైతులు మంగళవారం ధర్నా నిర్వహించారు. రైతు సంఘం మైలవరం మండల అధ్యక్ష, కార్యదర్శులు రావుల సుబ్బారావు, వజ్రాల వెంకటరెడ్డి, మండల కమిటీ సభ్యులు చిలుకూరు సుబ్బారెడ్డి, వజ్రాల శ్రీనివాసరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: విద్యుత్ భారాలు, స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా నూజివీడులోని ఏపీసీపీడీసీఎల్ ఈఈ కార్యాలయం వద్ద సీపీఐ, సీపీఎం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై భారం పడటమే కాకుండా విద్యుత్ సంస్థలు విద్యుత్ వినియోగదారులను దోపిడీ చేస్తాయని, వీటికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఆరు రకాల పేర్లతో వసూలు చేస్తున్న చార్జీలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు స్మార్ట్ మీటర్ల భారం కూడా ప్రజలపై వేస్తున్నారని ఆరోపించారు. సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రాజు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేసుకొని, ట్రూఅప్ చార్జీలు వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, చాట్ల పుల్లారావు, మడుపల్లి నాగేంద్రరావు, రైతు సంఘం నాయకులు కూచిపూడి నాగేశ్వరరావు, సీపీఎం పట్టణ కార్యదర్శి ఎన్ఆర్ హనుమాన్, మండల కార్యదర్శి పి.సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

- ముసునూరు: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును, విద్యుత్ చార్జీల పెంపును తక్షణం విరమించుకోవాలని వామపక్షాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముసునూరులో మంగళవారం సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రాజు మాట్లాడారు. అనంతరం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. సీపీఐ, సీపీఎం మండల నేతలు చెంగల వెంకటేశ్వరరావు, కొడవలి శ్రీనివాస్, అబ్బూరి రంగారావు, పిల్లి మురళి, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.
- ఆగిరిపల్లి: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను తొలగించాలని కోరుతూ మంగళవారం సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి శివనాగరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లను తొలగించి, విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాషా, ముత్యాల నరేష్, నవీన్, కిరణ్ కుమార్, సుబ్బారావు పాల్గొన్నారు.



తిరువూరులో ధర్నా చేస్తున్న కాంగ్రెస్, వామపక్షాల నాయకులు



నూజివీడులో ధర్నా చేస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని వినతి

మైలవరం: జర్నలిస్టుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ మైలవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీయూడబ్ల్యూజే మైలవరం మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ అబ్దుల్ దరియాకు అందజేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న అక్రిడిటేషన్ల గడువు ఈ నెల 31వ తేదీతో ముగియనుందని, గడువు పొడిగించకుండా కొత్త అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు శ్రేష్టమైన పౌష్టికాహారం



వేల్పుచర్లలో సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ముసునూరు: తల్లి ఒడిలో ఒదిగిన శిశువు ఎదిగే వరకూ తల్లిపాలే శ్రేష్టమైన పౌష్టికాహారమని ఐసీడీఎస్ నూజివీడు సీడీపీఓ విజయకుమారి అన్నారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా వేల్పుచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కార్యక్రమం, సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ తల్లీబిడ్డల క్షేమం కోసం అంగన్‌వాడీల ద్వారా అందుతున్న పోషకాహారాన్ని విధిగా స్వీకరించాలని గర్భిణులకు సూచించారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లోని పోషకాహారాన్ని స్వీకరించి రక్తహీనతను తరిమి సుఖప్రదమైన ప్రసూతితో పాటు, ఆరోగ్యకరమైన బిడ్డను పొందాలని ఆకాంక్షించారు. గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

26న ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ

ఇబ్రహీంపట్నం: మైలవరంలో ఈనెల 26న జరుగనున్న ఆశా వర్కర్స్ యూనియన్ ఆరో జిల్లా మహాసభను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.కమల కోరారు. ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ వద్ద ఆశా వర్కర్స్‌తో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లు గత 20 ఏళ్లుగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల పేదలకు వైద్య సేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని చెప్పారు. ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, మట్టి ఖర్చులు, రికార్డులు, సాధారణ సెలవులు, మెటర్నిటీ లీవులు తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుడు మహేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఈఓ 1గా శ్రీను

చాట్రాయి: ఎంఈఓ-1గా ఎం.శ్రీను మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఏలూరు కోటదిబ్బ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఎంఈఓ-1గా వచ్చిన ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనను పలువురు అభినందించారు.